ప్రజాశక్తి
సోమవారం 12 ఫిబ్రవరి 2024 | 5 | అనంతపురం

బాలోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

రబీలోనూ వర్షాభావమే..!

కరువు మండలాల ప్రకటనుండేనా ?

ఖరీఫ్ సాయమూ కరువు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రబీ సీజన్‌లోనూ వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. పంటల సాగు కూడా సాధారణం కంటే 60 శాతం వరకు అనంతపురం, సత్యసాయి జిల్లాలో జరిగింది. అనంతపురం జిల్లాలో రబీలో 1.13 లక్షల హెక్టార్లలో పంటలు సాగవ్వాల్సి ఉండగా కేవలం 80 వేల ఎకరాల్లోనే సాగైంది. సత్యసాయి జిల్లాలో 27 వేల హెక్టార్లకుగనానూ 20 వేల హెక్టార్లే సాగైంది. సాగైన పంట కూడా వర్షాభావంతో పూర్తి స్థాయిలో దిగుబడులు రాలేడు. ప్రదానంగా పప్పుశనగ పంట వర్షాధారం కింద నల్లరేగడి నేలల్లో సాగు అయ్యింది. సాధారణ సాగు 78 వేల హెక్టార్లకు గానూ 48 వేల హెక్టార్లలో అయ్యింది. వర్షాలు సకాలంలో లేకపోవడంతో దిగుబడులు నామమాత్రంగానే ఉన్నాయి. పంట నూర్పిడి సైతం ఈ పంట నష్టాన్ని ఏ మేరకు అంచనా వేసారన్నది ప్రశ్నార్ధకంగానే ఉంది.

రబీ కరువు మండలాలు ప్రకటించేరా..?

అనంతపురం జిల్లాలో 31 మండలాలకుగానూ 22 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఇప్పటికీ నెలకొని ఉన్నాయి. ఒకవైపు ఖరీఫ్‌లో అనంతపురం జిల్లాలో 28 మండలాలు కరువు మండలాలను ప్రభుత్వం ప్రకటించింది. ఇక రబీలోనూ వర్షాభావమే నెలకొనడంతో రబీలోనూ కరువు మండలాల ప్రకటన జరగాల్సి ఉంది. ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 461.2 మిల్లీమీటర్లు కురావాల్సి ఉండగా 293.3 మిల్లీమీటర్లు పడింది. ఇక సత్యసాయి జిల్లాలో సాధారణ వర్షపాతం ఇప్పటి వరకు 529.3 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 368.4 మిల్లీమీటర్లు నమోదయ్యింది. 23 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ రబీ పంటల సాగు కూడా నామమాత్రంగానే ఉంటుంది. వేసిన పంటలు కూడా వర్షాల్లేక చేతికొచ్చే పరిస్థితులు కనిపించడం లేదు.

ఖరీఫ్ సాయమే లేదు... రబీ సాయం ఉండేనా..?

ఖరీఫ్‌లో పంట నష్టం జరిగితే దాని అంచనాలను రూపొందించారు. అనంతపురం జిల్లాకు రూ.251 పరిహారం అందివ్వాలని అంచనాలను రూపొందించారు. కాని ఇప్పటి వరకు పరిహారం మంజూరుపై ప్రభుత్వం అధికారిక ప్రకటనేది చేయలేదు. ఇక రబీలో పంటల పరిస్థితుల గురించే పట్టించుకుంటున్న దాఖలాల్లేవు. రైతులు నష్టపోయి సాయం కోసం ప్రభుత్వం వైపు ఎదురు చూసే పరిస్థితులున్నాయి. ప్రభుత్వం ఎన్నికల్లోపు అయినా ఏదైనా ప్రకటన చేస్తుందా లేదా అన్నది చూడాల్సి ఉంది.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

చంద్రశేఖర్‌రెడ్డి ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

ప్రభుత్వం తక్షణం రైతులను ఆదుకోవాలి. రబీలోనూ నష్టం అంచానలను రూపొందించాలి. కరువు మండలాలు ప్రకటించాలి. అదే విధంగా ఖరీఫ్ పంట నష్టంకు సంబంధించి పరిహారం అందివ్వాలి. ఎన్నకల్లోపు ప్రకటించాలని కోరుతున్నాం.

నేటి నుంచి పిల్లల పండుగ

- ‘ఆర్ట్స్ కళాశాల మైదానంలో ‘అనంత బాలోత్సవం-4’
- ఏర్పాట్లను పరిశీలించిన కమిటీ సభ్యులు
- 60 ఈవెంట్స్‌లో పిల్లల ప్రదర్శనలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంత బాలోత్సవం-4 పిల్లల పండుగ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో సోమ, మంగళ, బుధవారాల్లో మూడు రోజుల పాటు నిర్వహించే అనంత బాలోత్సవంలో పిల్లలు ఆటపాటలతో సందడి చేయనున్నారు. బాలోత్సవంకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు ఆదివారం సాయంత్రం పరిశీలించారు. బాలోత్సవ కమిటీ ఛైర్మన్ షమీమ్ షఫీవుల్లా, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి, కోశాధికారి జిలాన్, కమిటీ సభ్యులు గోవిందరాజులు, కోటేశ్వరప్ప, రామాంజినమ్మ, పరమేష్, రాజేశ్వరి, శ్యామల, శివ శంకర్, తదితరులు హాజరై ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ షమీమ్ షఫీవుల్లా మాట్లాడుతూ పిల్లలు పుస్తకాలతో కుస్తీ పడుతూ ఆట పాటలకు దూరమై మానసిక ఒత్తిడి లోనవుతూ బాల్యంలో పొందాల్సిన ఆనందాన్ని కోల్పోతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పిల్లల్లో మానసిక ఉల్లాసం, వారిలోని సృజనాత్మకతను వెలికి తీయాలన్న ఉద్ధేశంతో ఏటా అనంతపురం నగరంలో అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ‘అనంత బాలోత్సవాల’ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లనూ ఇప్పటికే పూర్తి చేశామన్నారు.



బాలోత్సవ ఏర్పాట్ల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

భారతరత్న పివి.నరసింహారావు ప్రాంగణంలో..

అనంత బాలోత్సవం-4లో భాగంగా ఆర్ట్స్ కళాశాల మైదానంకు మాజీ ప్రధాని, భారతరత్న పివి.నరసింహారావు ప్రాంగణంగా నామకరణం చేశారు. ఈ ప్రాంగణంలో స్టేజ్-1కు వ్యవసాయ శాస్త్రవేత్త, భారతరత్న ఎంఎస్.స్వామి నాథన్, స్టేజ్-2కి పద్మశ్రీ నాజర్, స్టేజ్-3కు రచయిత జూపల్లి ప్రేమ్ చంద్, స్టేజ్-4కు అనంత బాలోత్సవం పేర్లను పెట్టారు. ఈ వేదికల్లో మూడు రోజుల పాటు పిల్లలు ప్రదర్శనలు జరగనున్నాయి. 12వ తేదీన ఉదయం 10 గంటలకు బాలోత్సవాలు ప్రారంభం అవుతాయి.

60 రకాల ఈవెట్స్‌లో ప్రదర్శనలు

బాలోత్సవంలో 60 రకాల ఈవెట్స్‌లో పిల్లలు ప్రదర్శనలు ఇవ్వనున్నారు. **అకడమిక్ ఈవెంట్స్‌లో..** చిత్రలేఖనం, కార్టూన్, వ్యాసరచన, కథా విశ్లేషణ, కవితా రచన, కథా రచన, దినపత్రిక పఠనం, మెమొరీ టెస్ట్, సైన్స్ ఎగ్జిబిషన్, బెస్ట్ ఫ్రం వేస్ట్ వంటి అంశాలపై పోటీలు జరుగుతాయి. **కల్చరల్ ఈవెంట్స్‌లో..** జానపద గీతాలాపన, దేశభక్తి గీతాలాపన, లఘు నాటికలు, విచిత్ర వేషధారణ, ఫ్యాన్సీ డ్రస్ వంటి పోటీలు ఉంటాయి.. అకడకమిక్, కల్చరల్ కలిపి మొత్తం 60 రకాల ఈవెంట్స్ ఈ మూడు రోజుల కార్యక్రమాల్లో జరుగనున్నాయి. రోజుకు సుమారు 3 వేల మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 500కు పైగా పాఠశాలలు ఇందులో పాల్గొనేందుకు ముందుకొచ్చాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రతి రోజూ జరిగే కార్యక్రమాలకు సంబంధించి ఏ రోజుకారోజు బహుమతులను అందజేయ నున్నారు.

నన్ను విమర్శించి ‘మెట్టు’ను గెలిపించలేరు..

వైసిపి నాయకులకు విప్ ‘కాపు’ కౌంటర్

ప్రజాశక్తి-రాయదుర్గం

‘నన్ను విమర్శించడం వల్ల వైసిపి అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డిని గెలిపించలేరు’ అని విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. వైసిపి రైతు విభాగ ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి చేసిన విమర్శలకు కౌంటర్‌గా కాపు రామచంద్రారెడ్డి ఆదివారం సెల్ఫీ వీడియో విడుదల చేశారు. తనను విమర్శించడం వల్ల గోవిందరెడ్డి గెలుస్తాడంటే విమర్శించవచ్చు.. అయితే ఎవరి ఎన్నిక విషయంలో ఎవరిని విమర్శిస్తారనే విషయాన్ని గుర్తు పెట్టుకుని విమర్శించాలన్నారు. 2009 ఎన్నికల్లో ఉపేంద్రరెడ్డి రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులుగా ఉన్నప్పుడు అతడి వెంట 29 మంది వార్డు సభ్యులు ఉన్నారన్నారు. మున్సిపల్ కౌన్సిల్ పాలకమండలి పదవిని సగం కాలం చేనేతలకు ఇస్తారని చెప్పి ఎందుకు ఇవ్వలేదో మీకే తెలియాలన్నారు. మీరే ఐదేళ్లపాటు ఎందుకు మున్సిపల్ ఛైర్మన్‌గా కొనసాగారో కారణాలు ప్రజలకు తెలుసన్నారు. 2012 అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి తరపున పోటీ చేసిన తనతో విభేదించి తనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ తరపున ఉపేంద్ర రెడ్డి ప్రచారం చేసిన విషయాన్ని గుర్తుకు చేశారు. మీరు ఏవైపున ఉంటే ఆ పార్టీకి పట్టణంతోపాటు మీ వార్డుల్లోనూ ఓట్లు మైనస్ అయ్యాయన్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా రాయదుర్గంలో ఉపేంద్రరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులో తక్కువ ఓట్లు వచ్చాయన్నారు. అందుకు ఎన్ని కారణాలైన ఉండవచ్చున్నారు. ప్రస్తుతం 2024 ఎన్నికల్లో 30 మంది వార్డు సభ్యులు మీవైపు ఉన్నారని, రాయదుర్గంలో, మీ వార్డులోనూ వైసిపికి ఎక్కువ ఓట్లు వచ్చే విధంగా కష్టపడి పని చేసి ఈసారైనా మెట్టు గోవింద రెడ్డిని గెలిపించుకోవాలని హితవు పలికారు. మీరు ఎవరిని సపోర్ట్ చేస్తే ఆ వార్డులో మెజారిటీ రాదని నిందను తొలగించుకోవాలని సూచించారు. పల్లేపల్లిలోనూ గత పంచాయతీ ఎన్నికల్లో వైసిపి సానుభూతి సర్పంచి ఓడిపోగా ఈసారి అక్కడ అందరూ కష్టపడి అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపికి మెజారిటీ వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. తనను విమర్శించిన వారి స్థాయివారితోనే త్వరలోనే కౌంటర్ ఇప్పిస్తామన్నారు. ఇది కౌంటర్ కాదని.. తప్పుగా అర్థం చేసుకోవద్దని.. ఓ బావగా సలహా ఇస్తున్నానని వీడియో ముగించారు.

చంద్రబాబుతోనే బిసిల అభివృద్ధి

‘జయహో బిసి’లో మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుమ్మగట్ట

టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రంలోని బిసి అభివృద్ధి సాధ్యమని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోగల కలుగోడు గ్రామంలో కాలువ సన్నన్న ఆధ్వర్యంలో జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన గుమ్మగట్ట మండలానికి తనవంతుగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశానని గుర్తు చేశారు. ముఖ్యంగా భైరవాణితిప్ప ప్రాజెక్టుకు (బిటిపి) కృష్ణాజలాలను రూ.968 కోట్లతో ప్రాజెక్ట్ ప్రారంభించి 30 శాతం వరకూ పనులు చేశామన్నారు. తర్వాత వైసిపి అధికారంలోకి రావడంతో ప్రాజెక్టును పూర్తిగా విస్మరించిందన్నారు. అంతేకాకుండా బీసీ కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వకుండా, సబ్సిడీ రుణాలు లేకుండా చేసిన ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. ప్రతిసభలోను ‘నా ఏస్సీ.. నా ఎస్టీ.. నా బిసి.. నా మైనారిటీ..’ అని చెప్పుకునే సిఎం ఆయా వర్గాలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేసి కూలీలుగా మారుస్తున్నాడన్నారు. విదేశీ విద్య ఎక్కడా కనబడడం లేదన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరును కూడా మార్చిన ఘనత జగన్‌దే అని ఎద్దేవా చేశారు. జగన్ అధికారంలోకి వచ్చాక దాదాపుగా 76 మంది టిడిపి బిసి కార్యకర్తలను హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రూ.150 కోట్లతో వడ్డెర్లకు జెసిబిలు, నాయీ బ్రాహ్మణులకు పనిముట్లు, రజకులకు దోబీఘాట్లు కటించామని గుర్తు చేశారు. ఇవన్నీ తిరిగి రావాలంటే వచ్చే ఎన్నికల్లో టిడిపిక ఓటు వేసి చంద్రబాబును సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కృష్ణ, జనసేన నాయకులు మంజునాథ్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు పసుపులేటి రాజు, మండల అధ్యక్షులు గిరి మల్లప్ప, గుమ్మఘట్ట సర్పంచి విజయలక్ష్మి, వీరాపురం సర్పంచి నాగరాజు, రాయదుర్గం కౌన్సిలర్లు భారతి, కేతు దొడ్డి రాజు, తిప్పయ్య, దానవేంద్ర, ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

వికలాంగుల అభ్యున్నతికి చేయూత

- అర్హులకు ప్రభుత్వ పథకాల వర్తింపు
- త్వరలో ఉద్యోగాల భర్తీకి చర్యలు
- ఉమ్మడి అనంతపురం జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల, సంక్షేమ శాఖ ఏడీ ఎస్.అబ్దుల్ రసూల్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఎడీ అబ్దుల్ రసూల్

వికలాంగులు, వయో వృద్ధులు, హిజ్రాలు, సమాజంలో అన్ని రంగాల్లో వెనుకబడిన వారికి ప్రభుత్వం నుంచి అన్ని విధాలా చేయూతను అందిస్తున్నట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా విభిన్న విద్యావంతులు హిజ్రా వయోవృద్ధుల, సంక్షేమ శాఖ అధికారి ఎస్.అబ్దుల్ రసూల్ పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటి వారిని గుర్తించి వారికి ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందించేలా తమ శాఖ కషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలపై అవగాన కల్పించి వాటి లబ్ధిని అర్హులకు యేకూరుస్తున్నట్లు చెప్పారు. ఆదివారం నాడు ప్రజాశక్తి ముఖాముకిలో ఆశాఖ ద్వారా జరుగుతున్న పలు విషయాలను ఆయన తెలియజేశారు.

ప్రశ్న: ఉమ్మడి జిల్లాలో ప్రోత్సాహాల గురించి వివరించండి.?

ఎడి : ప్రస్తుతం అనంతపురం, సత్యసాయి జిల్లాలో ఉన్న విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధి కోసం అనంతపురంలో జిల్లా కార్యాలయం ఏర్పాటు చేశాం. అక్కడి నుంచి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో కార్యాలయాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నాం. ఇటీవల ఉమ్మడి జిల్లాల్లో వికలాంగుల కోసం మూడు చక్రాల వాహనాలను పంపిణీ చేశాం. డిగ్రీ, పీజీ విద్యార్థులకు ట్యాబులను, ట్రైసైకిళ్లను పంపిణీ చేశాం.

ప్రశ్న: విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు ఏమిటి.?

ఎడి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన రెండు పథకాలను అమలు చేస్తోంది. డిగ్రీ, డిప్లొమా అంతకంటే ఎక్కువ తరగతులు చదువుతున్న విద్యార్థులకు 40 శాతం అంతకంటే ఎక్కువ అంగవైకల్యం కలిగి ఉండి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు మించని విద్యార్థులకు వీటిని మంజూరు చేస్తున్నాం. వీటిని పొందేందుకు అర్హులైన వారు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలి

ప్రశ్న:విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగాలు కల్పిస్తున్నారా.?

ఎడి: ఏపీ ప్రభుత్వం 2002 నుంచి వికలాంగుల కోసం ప్రత్యేక రిక్రూట్మెంట్‌ను నిర్వహిస్తోంది. 2020 సంవత్సరంలో నాలుగు శాతం రిజర్వేషన్లు పెంచింది. 1:1:1:1 నిష్పత్తి ప్రకారం దృష్టిలోపం, వినికిడి లోపం, వైకల్యం, ఆర్థిజన్, మేధావైకల్యం, నిర్దిష్ట అభ్యాసన వైకల్యం, మానసిక అనారోగ్యం, బహుళ వైకల్యం, ఉన్నవారికి ఈ సంవత్సరం నుంచి బ్యాక్లాగ్ పోస్టులు ఇవ్వనున్నాం. ఇదివరకు 37 పోస్టులను మంజూరు చేశాం. వీటిని నెలలోపు భర్తీ చేయనున్నాం. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు నోటిఫికేషన్ జారీ చేస్తాం.

ప్రశ్న: అంధుల కోసం చేస్తున్న కార్యక్రమాలు ఏమిటి.?

ఎడి:ఉమ్మడి అనంతపురం జిల్లాలో అంధుల కోసం రెండు హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో 160 మంది అంధులకు పునరావవాసం కల్పించాం. వారిలో వందమంది బాలురు, 50 మంది బాలికలు ఉన్నారు. అంధుల కోసం గృహం, హాస్టల్లో గహావైద్యులకు ఉచితంగా వసతి, ఆహారం కాస్మోటిక్ ఛార్జీలు ఇస్తున్నాం. వయోవద్దులకూ కొన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

ప్రశ్న: వికలాంగులకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఇస్తున్నారు..?

ఎడి : వికలాంగులు, వయోవద్ధుల విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో పథకాల ద్వారా చేయూతను ఇస్తోంది. విద్యార్థులు తల్లిదండ్రుల ఆదాయాన్ని బట్టి జాతీయ ఉపకార వేతనాలు, ట్రై సైకిల్, చక్రాల కుర్చీలు, త్రీ వీలర్లు, వినికిడి పరికరాలు, వాకింగ్ స్టిక్, ప్లేట్లు వంటి వివిధ సహాయ ఉపకరణాలను అందిస్తోంది. డిప్లొమా, డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులకు ప్రొఫెషనల్ కోర్సులు చేస్తున్న వారికి ట్యాబ్లనూ ప్రభుత్వం ద్వారా అందిస్తున్నాం.

‘సిద్ధం’ను విజయవంతం చేద్దాం : ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

మండల కేంద్రంలో నిర్వహించనున్న సిద్ధం సభకు భారీగా తరలివచ్చి సిఎం జగనన్నకు అండగా నిలుద్దామని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సభ దేశ చరిత్రలో నిలిచిపోనుందన్నారు. 50 నెలల జగనన్న పాలన ప్రతి గుండె తలుపూ తట్టిందన్నారు. ముఖ్యంగా సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చారన్నారు. దేశం యావత్తు జగనన్న వైపు చూస్తోందన్నారు. సిద్ధం సభకు తామంతా సిద్ధంగా ఉన్నామని ప్రతి కార్యకర్త చెబుతున్నాడన్నారు. రాయలసీమలోని 52 నియోజకవర్గాల నుంచి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గతంలో రాయలసీమ నుంచి 3 నియోజకవర్గాల్లో టిడిపి నాయకులు గెలిచారని, ఈసారి అవి కూడా వైసిపికే ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ముఖ్యంగా రాప్తాడు నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు లక్షలాదిమంది తరలిరావాలని పిలుపునిచ్చారు. కాగా కనీసం వార్డు మెంబరు కూడా గెలవలేని నారా లోకేష్ మాటలను పట్టించుకోవాల్సిన పనిలేదన్నారు. అనంతరం రూరల్ మండలం, రాప్తాడు మండల పరిధిలోని పార్టీ కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఛైర్మన్లు, డైరెక్టర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

అధికారం అండగా.. ఆదాయం మెండుగా..!

- ఆదాయ వనరుగా రాయదుర్గం వాణిజ్యభవన సముదాయం
- నిధులు జెడ్పీవి.. అద్దె ఆదాయం అధికార పార్టీ నాయకులది..!
- లీజుపై జెడ్పీ అధికారులకు నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఫిర్యాదు.?

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాయదుర్గం మండల ప్రజాపరిషత్ వాణిజ్య భవన సముదాయాల లీజు వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ గదులు కేటాయింపు వ్యవహారంపై గతం నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికారం అండతో ప్రజా ప్రతినిధులు, అధికారులు కుమ్మక్కై 54 నెలలుగా జిల్లా పరిషత్, మండల పరిషత్ ఆదాయానికి గండి కొట్టినట్లు తెలుస్తోంది. ఎనిమిది గదులు తమ సొంతం అన్నట్టుగా అధికార పార్టీ నాయకులు ఐదు వేల రూపాయలకు తగ్గకుండా అద్దెకిచ్చి ఆదాయ వీటిని ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ప్రభుత్వ భవనాల అద్దెను అప్పనంగా అధికార పార్టీ నాయకులు కాజేస్తున్నా దీని గురించి జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తాజాగా ఈ గదుల అద్దె కేటాయింపులపై నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి జెడ్పీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ లీజు వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది.

గత టిడిపి ప్రభుత్వ హయాంలో రాయదుర్గం పట్టణంలో రోడ్ల విస్తరణలో భాగంగా అనంతపురం ప్రధాన రహదారి పక్కన ఉన్న మండల పరిషత్ కార్యాలయం ప్రహరీని కూల్చివేశారు. తరువాత ఈ ప్రాంతంలో వాణిజ్య సముదాయాన్ని నిర్మించాలని అప్పటి పాలకులు భావించి జిల్లా పరిషత్‌కు ప్రతిపాదనలు పంపారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి హోదాలో కాలవ శ్రీనివాసులు, జిల్లా పరిషత్ ఛైర్మన్ హోదాలో పూల నాగరాజు వాణిజ్యసముదాయ భవన పనులను ప్రారంభించారు. 8 గదుల నిర్మాణానికి రూ.25లక్షలు కేటాయించారు. 2017లో టిడిపి హయాంలో రూ.25 లక్షల జిల్లా పరిషత్ ప్రత్యేక నిధులతో వాణిజ్య సముదాయ భవనాలను నిర్మించారు. వైఎస్ఆర్ పార్టీ అధికారంలోకి వచ్చాక 2019 జూలై 2వ తేదీన ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి వాణిజ్య సముదాయాన్ని ప్రారంభించారు. గదుల కేటాయింపు మాత్రం నిబంధనల మేరకు జరగలదనే విమర్శలు పెద్ద ఎత్తున వ్యక్తం అయ్యాయి. 2019 నుంచి 2024 ఫిబ్రవరి దాకా సుమారు 54 నెలల పాటు ఆదాయాన్ని అధికార పార్టీ నాయకులే ఆర్జించినట్లు తెలుస్తోంది. ఒక్కో గదికి కనీస అద్దె 3000 రూపాయలుగా వేసుకున్నా 54 నెలలకు గాను రూ.12.96 లక్షల ఆదాయం అధికార పార్టీ నేతలకు వచ్చింది. మండల పరిషత్, జిల్లా పరిషత్‌కు ఒక్క రూపాయి కూడా అందలేదు. అక్కడున్న ఎనిమిది గదుల్లో నాలుగు గదులు జిల్లా పరిషత్, మరో నాలుగు గదులు మండల పరిషత్‌కు అద్దె రూపంలో తీసుకోవాల్సి ఉన్నా, అది అందకుండా పోయింది.

మండల పరిషత్ వాణిజ్య సముదాయ భవనాలు.

శాఖల మధ్య సమన్వయ లోపం

వాణిజ్య భవన నిర్మాణ పనులు పూర్తయ్యాక ప్రభుత్వ నిబంధనల మేరకు పూర్తైయిన షాపుల అప్పగింత ధ్రువపత్రం ఇవ్వాల్సిన పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఇవ్వకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకోలేకపోయామని గతంలో పనిచేసిన మండల శాఖ అధికారులు చెప్పారు. కంప్లీషన్ సర్టిఫికెట్ ఇవ్వమని గతంలో ఎంపీడీవోగా పనిచేసిన కొండయ్య పంచాయతీరాజ్ శాఖ అధికారులు, గదులకు వేలం వేసేందుకు అనుమతి ఇవ్వాలని జిల్లా పరిషత్ ఉన్నత అధికారులకు లేఖ రాసినప్పటికీ దానిపై ఎలాంటి స్పందనా రాలేదు. గత నెల 31న కొండయ్య ఉద్యోగ విరమణ చేశారు. ఈయన స్థానంలో ఎంపీడీవోగా అల్లాబకాష్ ఇటీవలే బాధ్యతలు తీసుకున్నారు. కొత్తగా వచ్చిన అధికారులు గదుల స్వాధీనంపై పంచాయతీరాజ్ అధికారులు స్పందించకపోవడంతోనే జాప్యం జరుగుతోందని చెబుతున్నారు.

రాజకీయ వేడితో తెరపైకి గదుల అద్దె వ్యవహారం

ఇటీవల రాయదుర్గం సమన్వయకర్త మార్పు వ్యవహారంతో అధికార పార్టీలో విభేదాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో అధికార పార్టీతో విభేదించిన ప్రజాప్రతినిధి వాణిజ్య సముదాయం విషయంపై జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఫిర్యాదుతో గదులకు సంబంధించి అద్దె ఉంటున్న వారి వివరాలు, ఇప్పటి దాకా అద్దెలు తీసుకున్న వారి వివరాలు పంపాలంటూ జిల్లా పరిషత్ అధికారులు మండల పరిషత్ అధికారులను ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. గదుల లీజుకు సంబంధించిన వ్యవహారంలో అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులను నాడు వెనకేసుకొచ్చిన ప్రజాప్రతినిధి నేడు జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడంపై సర్వత్రా చర్చ నడుస్తోంది. తనను లెక్కచేయని కారణంగా ద్వితీయ శ్రేణి నాయకులను లక్ష్యంగా చేసుకుని అధికారులకు ఫిర్యాదు చేశారనే భావనను వైసిపి నేతలు వ్యక్తం చేస్తున్నారు. నాయకుల మధ్య రాజకీయ విభేదాల కారణంగా బహిర్గతం అయిన గదుల లీజు వ్యవహారంపై ఉన్నతాధికారులు మాత్రం ఇప్పటికీ మౌనాన్నే ప్రదర్శిస్తున్నారు.

విచారణ జరుపుతాం

రాయదుర్గంలో జిల్లా పరిషత్‌కు చెందిన గదుల లీజు వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తాం. విచారణ నివేదిక అనంతరం దీనిపై చర్యలు చేపడతాం.

నదియాదేవి, జెడ్పీ సిఇఒ.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌కు అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌కు అంత్యక్రియలు

ఎస్పీ అన్బురాజన్ నివాళి

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

అనారోగ్యంతో మృతిచెందిన అనంతపురం ఏ.ఆర్ హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్‌కు ఆదివారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈయన 1992లో ఏపీఎస్పీ విభాగంలో కానిస్టేబుల్‌గా చేరారు. 2005లో ఏ.ఆర్ విభాగానికి కన్వర్షన్ అయ్యారు. అప్పటి నుంచి జిల్లా ఏ.ఆర్ విభాగంలో పని చేస్తున్నాడు. ఈనేపథ్యంలో అనారోగ్యానికి గురై మృతిచెందారు. మృతుడికి భార్య రాధ, కొడుకు సాయిపవన్, కూతురు కీర్తనలు ఉన్నారు. ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజా, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు, తదితరులు స్థానిక నందమూరినగర్‌లోని ఇంట్లో ఉంచిన రాజశేఖర్ మృతదేహాన్ని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. తర్వాత అధికార లాంఛనాలతో పిల్లిగుండ్ల క్వార్టర్స్ సమీపంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, మృతుని బంధువులు, బ్యాచిమేట్స్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు తిమ్మారెడ్డికి నివాళి

ప్రజాశక్తి-ఉరవకొండ

తిమ్మారెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

సీనియర్ జర్నలిస్టు తిమ్మారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ విలువలతో కూడిన జర్నలిజంతో ఆ రంగానికే వన్నె తెచ్చిన వ్యక్తి వై.తిమ్మారెడ్డి అని కొనియాడారు. వామపక్ష భావజాలాన్ని, రాయలసీమ ఉద్యమ అవసరాన్ని ప్రపంచానికి చాటడంలో ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాజెక్టుల సాధన కోసం ఎంతో తపించేవారన్నారు. నాటి రాయలసీమ నేతలు వైయస్ రాజశేఖర్‌రెడ్డి, మైసూరారెడ్డి, దివాకర్‌రెడ్డి వంటి వారితో కలిసి కృష్ణాజలాలను సీమకు తీసుకురావాలని నినదించారని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో తిమ్మారెడ్డి సోదరుడు వై.శ్రీనాథ్‌రెడ్డి, ఎంపిపి నరసింహులు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోనాథ్, పెన్నఅహోబిలం ఆలయ మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్, విలేకరులు రామాంజనేయులు, షేక్షావలి, ఆనంద్‌రావు, సుభాష్, విడపనకల్ జడ్పిటిసి హనుమంతు, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, మండల అగ్రి అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ వెంకటేష్, ఉప సర్పంచి వన్నప్ప, నాయకులు ఓబన్న, ఏసీ ఎర్రిస్వామి, భీమిరెడ్డి, బసన్న, గిరిబాబు, డోనేకల్ రమేష్, ఆసీఫ్, రామిరెడ్డి, నాగరాజు, రామాంజనేయులు, ఎర్రిస్వామిరెడ్డి, గట్టు ఎర్రిస్వామి, నిమ్మల రమణ, అంగదాల అంజి, జోగి భీమన్న, శర్మస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు టిడిపికే ఉంది : 'కాలవ'

ప్రజాశక్తి-డి.హీరేహాల్

కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం నియోజకవర్గంలో ఓటు అడిగే హక్కు..అర్హత ఒక్క తెలుగుదేశం పార్టీకే ఉందని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండలంలోని వసుగూడం గ్రామంలో 'మనకోసం మన శీనన్న' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దాదాపు 65 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరికి కాలవ శ్రీనివాసులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ చేస్తున్న అరాచకాలకు తట్టుకోలేక చాలామంది టిడిపిలోకి వలస వస్తున్నారు ఎన్నికలు జరిగే సమయానికి వైసీపీలో ఒక్క కార్యకర్త లేకుండా ఖాళీ అవుతుందన్నారు. తన నాయకత్వాన్ని నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టంగా అర్థం అవుతోందన్నారు. అంతేగాకుండా చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేసుకుంటేనే అన్నివర్గాల ప్రజలకూ న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, ఎంపిటిసిలు మొండి మల్లికార్జున, గంగాధర్, నాయకులు వన్నూరుస్వామి, సోమలాపురం శంకర్, నాగరాజు, మల్లికార్జున, చంద్రశేఖర్, మాకాశి వెంకటేశులు దేవా, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

టిడిపి జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు

ప్రజాశక్తి-పుట్లూరు

నియోజకవర్గంలో ఉపాధి హామీ పనుల్లో చోటు చేసుకున్న అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అక్రమ సంపాదన కోసం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి సమీప బంధువులు, అనుచరులు, ఉపాధి పనుల్లో అక్రమ మార్గాలను ఎంచుకున్నారన్నారు. ముఖ్యంగా శింగనమల మండలంలో సాంబశివారెడ్డి మేనమామ శ్రీరామిరెడ్డి ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఇదే పంథాలోనే నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నాయకులు ఉన్నారన్నారు. ఉపాధి హామీ పథకంలో కొందరు క్షేత్రస్థాయి పర్యవేక్షకులు అవినీతికి పాల్పడటం వల్లే అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి హామీ పథకంలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలపై సమగ్రంగా విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు రికవరీ చేపట్టాలని డిమాండ్ చేశారు.

తాడిపత్రిలో ఎంఎస్ ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-తాడిపత్రి

ఆసుపత్రి ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌ఒ ఇబి.దేవి

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న సిబి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఎస్ ఆసుపత్రిని డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ ఇ.బి.దేవి, ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్‌ఒ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. డీఎస్పీ శివనారాయణస్వామి మాట్లాడుతూ ఆరోగ్యకర జీవితానికి ఆత్మీయ చిరునామాగా ఎంఎస్ ఆసుపత్రి ఉంటుందన్నారు. ఇందులో మంచి నైపుణ్యం ఉన్న డాక్టర్లు చికిత్స చేయనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గైనకాలజీ డాక్టర్ షేక్, శరత్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సాబీర్ హుస్సేన్, కౌన్సిలర్ ఫయాజ్‌బాషా, షేక్షావలి, రామసుబ్బారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తాడిపత్రి సర్ ఖాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు లైసెన్సు తప్పనిసరి

ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై గౌస్

గార్లదిన్నె : ఆటో డ్రైవర్లు లైసెన్స్ లేకుండా ఆటో నడిపితే కఠిన చర్యలు తప్పవని గార్లదిన్నె ఎస్ఐ గౌస్ మహమ్మద్‌బాషా హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో ఆటో కార్మికులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటోలో ఓవర్ లోడ్‌తో వెళ్లకూడదన్నారు. రోడ్డు నిబంధనలు పాటించాలని తెలిపారు. మద్యం తాగి ఆటోలు నడిపితే కేసు నమోదు చేస్తామన్నారు. ఆటోలను అసాంఘిక కార్యక్రమాలకు వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదాలు జరిగిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజ్ఞ వికాసం పరీక్ష విజయవంతం

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని సెయింట్ పాల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞ వికాసం పరీక్ష విజయవంతంగా ముగిసింది. ముందుగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజాహుస్సేన్, యుటిఎఫ్ జిల్లా నాయకులు వెంకటరామిరెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ ప్రశ్నపత్రాన్ని విడుదల చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షలు అంటే భయం పోగొట్టేందుకే ప్రజ్ఞా వికాసం పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రశ్నపత్రాన్ని ప్రముఖ విద్యావేత్త కె.ఎస్ లక్ష్మణరావు తయారు చేసినట్లు వివరించారు. దాదాపు 300 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు గౌతమ్, ఉపాధ్యక్షులు ప్రేమ్, వీరేష్, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

గుత్తిలో పరీక్షను పర్యవేక్షిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుత్తి : పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాలలో ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్షను నిర్వహించారు. మోడల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన దాదాపు 700 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, కెఎస్‌కె ట్యూషన్ నిర్వాహకులు కె.సునీల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు లాలు, ధన, దర్శన్, విజయ్, కుమార్, జిలాన్ బాషా, షాషావలి, తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛవ్యాధిపై అపోహలు వీడాలి

కిమ్స్ సవీరా ఆసుపత్రి కన్సల్టెంట్, న్యూరాలజిస్టు జాషువా కాలేబ్

ప్రజాశక్తి-అనంతపురం

మూర్ఛ, వాయి జబ్బుపై ప్రజలు అపోహలు వీడి చికిత్స తీసుకుంటే నయం చేసుకోవచ్చని కిమ్స్ సవీరా ఆసుపత్రి కన్సల్టెంట్, న్యూరాలజిస్టు జాషువా కాలేబ్ సూచించారు. ప్రపంచ ఎపిలెప్సి దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వైద్య విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిన నేపథ్యంలో ఫిట్స్ నియంత్రణకు ఎన్నో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. చికిత్స తీసుకుంటే మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. మందులతో తగ్గని ఫిట్స్‌కు సర్జరీ ద్వారా కూడా నయం చేయవచ్చన్నారు. ముఖ్యంగా ఈ జబ్బు ఉన్న వారు పెళ్లిళ్లు చేసుకోవచ్చన్నారు. గర్భిణిగా ఉన్నప్పుడు ఫిట్స్ మందులు వాడితే తల్లీ బిడ్డకు ప్రమాదం ఉండదు. మూర్ఛ (ఎపిలెప్సీ/ఫిట్స్) ప్రతి వెయ్యిమందిలో నలుగురికి ఉంటుందన్నారు. ఇది ఏ వయసులోనైనా రావచ్చన్నారు. సాధారణంగా రెండేళ్ల వయసులోపు, తర్వాత 50, 60 ఏళ్లు పైబడిన వారిలో ఎక్కువగా వస్తుందన్నారు. మూర్ఛ మొదలైన తర్వాత వీరిలో నియంత్రణ లేకపోవడం వల్ల దీర్ఘకాల ఎపిలెప్సీతో ఏళ్లతరబడి బాధపడుతుంటారన్నారు. మెదడులోని ఒక బాగంలో అవసరానికి మించి విద్యుత్ శక్తి ఉత్పత్తి అవడం వల్ల ఫిట్స్ వస్తాయన్నారు. ఫిట్స్ లక్షణాలు భిన్నంగా కూడా ఉంటాయన్నారు. వందమంది ఫిట్స్ రోగులకు మందులతో చికిత్స చేస్తే 60 మందికి తగ్గుతుందన్నారు. అంటే మందులతో ఫిట్స్ నియంత్రణలో ఉంటుందన్నారు. చాలామందికి ఫిట్స్ మూడేళ్లు, ఐదేళ్లు మందులు వాడితే పూర్తిగా తగ్గిపోతుందనే అపోహతో ఉంటారన్నారు. వందలో 10 నుంచి 15 శాతం రోగుల్లో ఐదారేళ్లు మందులు వాడితే తగ్గించి ఆపేసే అవకాశముంటుందన్నారు. మిగితావారు జీవితాంతం మందులు వాడాల్సిందే అన్నారు. మందుల వల్ల తగ్గని ఫిట్స్ వ్యాధికి ఆపరేషన్ కూడా ఉందన్నారు. ఈ సర్జరీ 30 ఏళ్ల క్రితమే మొదలైందన్నారు. సర్జరీకి టీం వర్క్ చాలా కీలకం అన్నారు. న్యూరాలజిస్ట్, న్యూరోసర్జన్, ఎంఆర్ఐ నిపుణులు, న్యూక్లియర్ మెడిసిన్ నిపుణులుంటారన్నారు. 80శాతం కేసుల్లో టెంపరల్ లోబో ఎపిలెప్సీ చేస్తారన్నారు. వీరిలో మంచి ఫలితాలు ఉంటాయన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

కరపత్రాలు అందజేస్తున్న బండారు శ్రావణిశ్రీ

టిడిపి అధినేత నారా చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిన్న జలాలపురం గ్రామంలో 'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధి పూర్తిగా కుంటు పడిందన్నారు. కూల్చివేతలపైన పెట్టిన శ్రద్ధ అభివృద్ధిపై పెట్టడం లేదన్నారు. రాష్ట్రంలో కుంటుబడిన అభివృద్ధిని తిరిగి పరుగులు పెట్టించాలంటే ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక మినీ మేనిఫెస్టోలో పేర్కొన్న మహిళా సంక్షేమ పథకాలు, నీటి కొళాయిలు, బీసీ సంరక్షణ చట్టం, తదితర అంశాల గురించి కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి అమ్మలదిన్నె శాలిని, మాజీ మండల కన్వీనర్ చితంబరిదొర, సీనియర్ నాయకులు కె.బాబు, చిదానందనాయుడు, మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, మాజీ ఎంపిటిసి ఓబుళపతి, సత్యనారాయణ, రాజశేఖర్‌యాదవ్, రాముడు, గుర్రం లక్ష్మీనారాయణ, వెంకటనారాయణ, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎస్ డిజైనర్ స్టూడియో ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

ఎల్ఎస్ డిజైనర్ స్టూడియోను ప్రారంభిస్తున్న జిల్లా ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సువనా సోనీ

నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డు సర్కిల్లో ఓలా బైక్స్ షోరూం ఎదురుగా సిడిఆర్ కాంప్లెక్స్‌లో నూతనంగా నిర్మించిన ఎల్ఎస్ డిజైనర్ స్టూడియోను ఉమ్మడి అనంతపురం జిల్లా ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సువనా సోనీ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. అప్పుడే దేశం అభివృద్ధి వైపు పయనిస్తుందన్నారు. ముఖ్యంగా ఉన్నతమైన చదువులు చదవడం, ఉపాధి పరంగా అవకాశం ఉన్న రంగాల్లో నైపుణ్యం సాధించడం ద్వారా ఆర్థిక పురోగతిని అందిపుచ్చుకోవచ్చన్నారు. అంతేగాకుండా స్వశక్తితో ఎదగడంతోపాటు పలువురికి ఉపాధి అందించే దిశలో పయనించాలన్నారు. ఈ క్రమంలో స్వశక్తితో ఎదుగుతున్న మహిళలను ప్రోత్సహించాల్సిన అవసరం కుటుంబ సభ్యులకు మిత్రులకు ఎంతో ఉందన్నారు. ఈ దిశలోనే ఎల్ఎస్ డిజైనర్ స్టూడియో అధినేత వర్షిత పురోగతి సాధించడం అభినందించదగ్గ విషయమన్నారు. ఎల్ఎస్ డిజైనర్ స్టూడియో అధినేత వర్ష మాట్లాడుతూ తమ వద్ద ప్రత్యేకంగా యూపీ, కలకత్తాకు చెంది అపార అనుభవం, నైపుణ్యం ఉన్న కార్మికులతో మగ్గం వర్క్, బ్రైడల్ బ్లౌజ్, లాంగ్ ఫ్రాక్స్, డిజైనర్ గాగరాస్, కుర్తీస్, మామ్ డాటర్ డ్రస్సులు ప్రత్యేకంగా తయారు చేయనున్నట్లు తెలిపారు. తమ సంస్థకు సంబంధించిన రెడీమేడ్ దుస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బేబీ, మధు, జ్యోతి, మహేష్, వందన, సుమతి, ఉషా, వేణుగోపాల్, బాలు, వెంకటరమణ, డాక్టర్ నగరూరు రసూల్, పలువురు ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా!

ఎమ్మెల్యే 'అనంత'కు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి సవాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధి, వైసిపి అధికారంలోకి వచ్చాక జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి సవాల్ విసిరారు. ఆదివారం అనంతపురం అర్బన్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గెలిచిన ఆరునెలల్లోనే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, డంప్ యార్డ్ తరలిస్తామని చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో నిధులు విడుదల చేయిస్తే అన్ని పనులనూ తానే చేశానంటూ అనంత వెంకటరామిరెడ్డి ఢంకా బజాయిస్తూ చెప్పుకోవడం ఎద్దేవా చేశారు. నగరంలో సూర్యానగర్ రోడ్డు, బస్టాండ్ రోడ్డు నేనే వేయించానన్నారు. 2014 ఎమ్మెల్యేగా ఎన్నిక కాగానే రాత్రికి రాత్రే సూర్యానగర్ రోడ్డు వేయించిన ఘనత మాదే అన్నారు. 45 సంవత్సరాలుగా మీరు, మీ కుటుంబం రాజకీయాల్లోనే ఉన్నారు.. ఎప్పుడైనా నగరం అభివృద్ధి చేయాలని ఆలోచన వచ్చిందా.. అని నిలదీశారు. ఎంపీగా ఉన్నప్పుడు లోక్‌సభలో, ఎమ్మెల్యేగా శాసనసభలో ఒక్కసారైనా ప్రజా సమస్యలపై మాట్లాడావా అంటూ ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలన్నారు. టిడ్కో ఇళ్లు 90 శాతం తాము పూర్తి చేస్తే, 10 శాతం పనులు పూర్తిచేసి పేదలకు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నావన్నారు. రెండు నెలల్లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే 6వేల ఇళ్లతో పాటు, మరో ఆరువేల ఇళ్లు నిర్మించి పేదలకు అందిస్తామన్నారు. అలాగే నగరంలో పేదల కోసం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటు, పీస్ మెమోరియల్ హాల్, హైదరాబాదులోని లాల్ బహుదూర్ స్టేడియం తరహాలో పిటిసిని రూ.2కోట్లతో అభివృద్ధి చేశామనానరు. వందెకరాల్లో శిల్పారామాన్ని అభివృద్ధి చేస్తే, అక్కడ నీళ్లు లేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం లైట్లు వెలగని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కాగా కాగా మరువ కొమ్మ డిజైన్ మార్పునకు నిరసనగా ఈనెల 15న మున్సిపల్ కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజా సంఘాలు విద్యావంతులు మేధావులు తరలి రావాలన్నారు.

నేరాలు ఘోరాలు

గుత్తి పారిశ్రామికవాడలో చోరీ

గుత్తి : పట్టణంలోని పారిశ్రామికవాడలో ఉన్న ఓ ఇంటిలో చోరీ జరిగింది. ఓ ప్రయివేటు పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న విక్రమ్ దైవదర్శనం కోసం మూడు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి షిరిడీ వెళ్లారు. గమనించిన గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు తొలగించి లోనికి ప్రవేశించారు. బీరువాను బద్దలు కొట్టి అందులోని రూ.20వేల నగదు, బంగారు, వెండి నగలు, మొబైల్ ఫోను ఎత్తుకెళ్లారు. దైవ దర్శనం నుంచి ఆదివారం ఇంటికి వచ్చిన విక్రమ్ చోరీ ఘటనను గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బియ్యం బస్తాలు పట్టివేత

మండలంలోని తొండపాడు గ్రామంలో ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యం బస్తాలను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. సమాచారం మేరకు సీఐ ఎం.వెంకటరామిరెడ్డి దాడులు నిర్వహించి గ్రామ శివారులోని ఓ రేకుల షెడ్డులో ఉన్న 150 బస్తాల స్టోర్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం బస్తాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బియ్యం బస్తాలను రెవెన్యూ అధికారులకు అప్పగించనునట్లు సీఐ తెలిపారు. అక్రమంగా బియ్యాన్ని నిల్వ ఉంచిన వారిపై కేసు నమోదు చేస్తామని వెల్లడించారు.

కూలీల ట్రాక్టర్ బోల్తా.. ఐదుగురికి గాయాలు

బొమ్మనహాల్ : మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో రైతు హరిజన శ్రీనివాసులు తన రైతు పొలంలో మిరప పంట కోయడానికి తీసుకెళ్తున్న కూలీల ట్రాక్టర్ ఆదివారం బోల్తా పడింది. దీంతో ఐదుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ట్రాక్టర్‌లో 15 మంది కూలీలు ప్రయాణిస్తుండగా కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలపాలైన హరిజన శివమ్మ, హరిజన వనరమ్మ, హరిజన కాదమ్మ, వండరమ్మ, తిప్పమ్మను వెంటనే బళ్లారిలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

పేకాటజూదరులు అరెస్టు

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని చింతలపల్లి గ్రామ శివార్లలోని ఓ చీనీతోటలో పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు పెద్దవడుగూరు ఎస్‌బి ఎస్ఐ రోషన్, ఎస్ఐ శరత్‌చంద్ర తెలిపారు. ఈమేరకు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. చింతలపల్లిలోని ఓ చీనీతోటలో పేకాట ఆడుతున్నట్లు సక్కాగా సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో 12 మందిని అదుపులోకి తీసుకుని రూ.1,04,040 నగదుతోపాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పెద్దవడుగూరు సీఐ సెల్.. 94913 08871, పెద్దపప్పూరు ఎస్ఐ సెల్..93460 10575 నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. వివరాలు తెలిపిన వారి విరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

14న రాతిదూలం లాగుడు పోటీలు

కుందుర్పి : ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభమయ్యే లక్ష్మీ వెంకటేశ్వర రథోత్సవం సందర్భంగా నిర్వహించే రాతిదూలం లాగుడు పోటీలకు పేర్లు నమోదు చేసుకోవాలని కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న ఉదయం రాతిదూలం లాగుడు పోటీలు ఉంటాయన్నారు. నమోదు చేసుకునే ఎద్దుల యజమానులు రూ.500 ఎంట్రెన్స్ ఫీజు కట్టాల్సి ఉంటుందన్నారు. మొదటి బహుమతి రూ.30 వేలు, 2వ బహుమతి రూ.20 వేలు, 3వ బహుమతి రూ.15వేలు, 4వ బహుమతి రూ.10వేల బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఉత్సావహవంతులు సెల్..99856 96837, 91607 38009, 96808 44267, 91103 48592 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

గ్రానైట్స్, టైల్స్ కార్మికుల యూనియన్ ఎన్నిక

అనంతపురం కలెక్టరేట్ : గ్రానైట్స్, టైల్స్ కార్మికుల యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సిఐటియు నగర న్యూ కమిటీ కార్యదర్శి ముత్తుజా, జిల్లా కోశాధికారి గోపాల్ తెలిపారు. ఆదివారం అనంతపురం బళ్లారి రోడ్డులోని ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో (సిఐటియు) ఆధ్వర్యంలో గ్రానైట్ టైల్స్ కట్టర్స్ కార్మికుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షులుగా ఎస్.ముత్తుజ, అధ్యక్షులుగా ఎర్రిస్వామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వీరయ్య, కోశాధికారిగా ఇమామ్, ఉపాధ్యక్షులుగా హుస్సేన్, రజాక్, సహాయ కార్యదర్శులుగా ప్రసాద్, ధనతో పాటు కమిటీ సభ్యులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గోపాల్, సిఐటియు నగర కార్యదర్శి ముత్తుజ, నగర 1వ కమిటీ అధ్యక్షులు ఎన్టీఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో వేలాదిగా ఉంటున్న గ్రానైట్ అండ్ టైల్స్ కార్మికుల సంక్షేమం కోసం వారి హక్కుల కోసం నూతనంగా కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో కార్మికులకు పనికి తగ్గ కూలి రేట్లు వచ్చేలా పోరాడుతామని, ప్రభుత్వం నుంచి భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులందరికీ రావలసిన పథకాలను ఐక్యంగా సాధించుకుందామన్నారు. కార్మికులకు సిఐటియు ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు.

మార్క్సిస్ట్ మేధావి తరిమెల నాగిరెడ్డి

అనంతపురం కలెక్టరేట్ : సమాజంలో వెనుకుబాటు తనాన్ని పారదోలి, సమ సమాజ స్థాపనకు పోరాడిన గొప్ప మార్క్సిస్ట్ మేధావి తరిమెల నాగిరెడ్డి అని రక్తదాతల సంఘం తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, రైతు కూలీసంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ కొనియాడారు. తరిమెల నాగిరెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆదివారం రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఎదుట ఉన్న విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా గాయకుడు ఆదినారాయణ, ఎఐఎఫ్‌టియు నాయకులు నాగభూషణం, సుధాకర్, స్త్రీ విముక్తి సంఘటన మల్లేశ్వరి, శ్రీలక్ష్మి, రాధా, పిడిఎస్‌ఓ నాయకులు సాయి తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

అనంతపురం క్రైం : త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు శనివారం జిల్లావ్యాప్తంగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐల ఆధ్వర్యంలో పాత నేరస్తులు, రౌడీషీటర్లుచ కర్నాటక మద్యం, నాటుసారా, గుట్కా నియంత్రణ కోసం అనుమానితులు, పాత కేసుల్లోని నిందితుల ఇళ్లు, పశువుల పాకలు, గడ్డివాములను పరిశీలించారు. ఆయా గ్రామాలలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. గ్రామసభలు నిర్వహించి ప్రశాంతంగా జీవించాలని సూచనలు చేశారు. ఎలాంటి అల్లర్లకు వెళ్లకూడదని కోరారు. సాయంత్రం రోడ్డు భద్రతా నిబంధనల ఉల్లంఘనదారులపై చర్యలు తీసుకున్నారు.

అధిక లోడుతో వెళ్తున్న టిప్పర్లు.. ట్రాక్టర్లు

ఇబ్బందులు పడుతున్న కడవకల్లు గ్రామస్తులు

ప్రజాశక్తి-పుట్లూరు



వేగంగా వెళ్తున్న టిప్పర్

మండల పరిధిలోని కడవకల్లు గ్రామ సమీపంలోని పంట పొలాల నుంచి కొందరు టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. సమీప పొలాల నుంచి అధిక లోడుతో టిప్పర్లు, ట్రాక్టర్లు వెళ్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గ్రామంలోని చిన్న చిన్న సందుల్లో అతివేగంగా వెళ్తుండటంతో భయాందోళన చెందుతున్నారు. అంతేగాకుండా మట్టి రోడ్డుకు ఇరువైపులా పడుతుండటంతో అసౌకర్యానికి గురవుతున్నారు. కడవకల్లు గ్రామంలోని బిసి కాలనీలో నివాసం ఉంటున్న వారికి మట్టి వల్ల డస్ట్ అలర్జీ, జ్వరం వచ్చి ఆసుపత్రుల పాలవుతున్నారు. అంతేగాకుండా సందుల్లో చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు ఎక్కువగా తిరుగుతుంటారని, అధిక లోడుతో టిప్పర్లు, ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో వస్తుండటంతో ఏ ప్రమాదం సంభవిస్తుందో అని భయాందోళన చెందుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి అధిక లోడుతో వెళుతున్న టిప్పర్లు, ట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.